ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024

I



అల్లూరి సీతారామరాజు

మంచం పట్టిన గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని పిన్నకోట మారుమూల కొండ శిఖర గ్రామమైన రాచకిలం గ్రామంలో గత వారం రోజుల నుండి విష జ్వరాలు విజృంభించడంతో ఇంటింటా వ్యాదులతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన కొర్ర నాగరాజు, సూకూరు జ్యోతమ్మ, సుకురు సోమయ్య, సుకూర్ లక్ష్మణరావు, సూకూరు సింహాచలం, తో పాటు మరో ఎనిమిది మంది విష జ్వరాలతో వైద్యం కోసం ఎదురు చూస్తున్నారు. కలుషితమైన్న ఊటగెడ్డ నీటిని తాగడంతోనే వ్యాదులకు గురివుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అనారోగ్యంతో ఉన్న గిరిజనుడు

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- అల్లూరి జిల్లాలో 1,021 పోలింగ్ కేంద్రాలు -జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో ఈనెల 13న సజావుగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ గా ఏర్పాట్లను పూర్తి చేసామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 7లక్షల 71 వేల 193 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. పాడేరు, రంపచోడవరం, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గాలను 172 సెక్టార్లు విభజించి 190 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. పోలింగ్ అధికారులకు, సిబ్బందికి రెండు విడతలలో ఎన్నికల నిర్వహణపై సమగ్రమైన శిక్షణ అందించామని పేర్కొన్నారు. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గానికి అరకు వ్యాలీలోను, పాడేరుకు పాడేరు డిగ్రీ కళాశాలలోను, రంపచోడవరానికి ఇవియంలు పంపిణీకి మూడు పంపిణీ కేంద్రాలను ఏర్పాట్లు చేసామని చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గంలో రిసెప్షన్ కేంద్రం, అరకు వ్యాలీ, పాడేరు, అసెంబ్లీ నియోజక వర్గాలకు పాడేరులో రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసామని తెలిపారు.పోలింగ్ సరళిని పరిశీలించడానికి 200 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలోను మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. జిల్లాలో ఉదయం 7గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో 1021 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. 695 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందికి తగిన రవాణా సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ముందుగా లోక్ సభ స్థానానికి, తరువాత అసెంబ్లీ స్థానానికి ఓటు హక్కు వేయడానికి అవకాశం కల్పిస్తామన్నారు.

జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో ఉన్న 1021 పోలింగ్ కేంద్రాలలో 610 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని స్పష్టం చేసారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 5400 పోలీసులను నియమించామని చెప్పారు. సమాచార సేకరణకు సిగ్నల్ లేని చోట విహెచ్ ఎఫ్ సెట్లు ఏర్పాటు చేసామన్నారు. 4776 లీటర్ల నాటు సారా, 2740 లీటర్ల మద్యం సీజ్ చేసామన్నారు. 2424 కేజీల గంజాయి సీజ్ చేయడం జరిగిందన్నారు. నాలుగు నగదు కేసులను నమోదు చేసామన్నారు. 15 మంది అభ్యర్థులకు సెక్యూరిటీ సదుపాయం కల్పించామని, కౌంటింగ్ వరకు కొనసాగిస్తామని చెప్పారు. బయట వ్యక్తులు అనధికారంగా అతిథి గృహాలలో ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత



రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లును పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లును రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రిని పోలింగ్ అధికారులకు రిసెప్షన్ సెంటర్ ద్వారా అందజేయడం జరుగుతుందని, ఇందు కోసం 23 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆదివారం ఉదయం 6 గంటల నుండి ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రారంభమై 12 గంటలకు పూర్తయ్యే విధంగా అధికారులను సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గంలోని 399 పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షణ కొరకు ఎక్కడికక్కడ మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల విధులకు వచ్చిన అధికారులు, సిబ్బందికి టిఫిన్, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిడిఎంఎస్ యాప్ పర్యవేక్షణ కొరకు ఇన్చార్జిని నియమించామన్నారు. ఎన్నికల విధులకు వచ్చిన అధికారులు, సిబ్బందికి ఏ కౌంటర్లో రిపోర్ట్ చేయాలో తెలుసుకునేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి చెక్ లిస్ట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులను తరలించేందుకు ఐదు పోలింగ్ కేంద్రాలకు ఒక్క బస్సు చొప్పున ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దార్లు నజీముల్లా, కృష్ణజ్యోతి, ఏవి రమణ, సత్యనారాయణ, చలపతిరావు, నాగమణి, సత్య సులోచన, నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, స్వామి, ఎ.సత్యనారాయణ, శివ, శ్రీధర్, చైతన్య, సరిత, వీరభద్రరావు, రవీంద్రబాబు, విశ్వనాధ్, డిఎల్‌పిఓ రఘునందన్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, సిడిపిఓ సంధ్యారాణి, ఏయం ఓ శ్రీహరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో మూడు రోజులు భారీ వాహనాల రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల సంబంధించిన వాహనాలకు అడ్డంకులు లేకుండా మారేడుమిల్లి- చింతూరు మధ్య ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలకు మూడు రోజులపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారుల వాహనాలకు మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఈనెల 12 నుండి 14వ తేదీ ఉదయం వరకు భారీ వాహనాలను ఘాట్ రోడ్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలు నిర్వహించే అధికారులకు సిబ్బందికి బస్సులు, బొలెరో వాహనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులు

రాళ్ల రహదారిపై వాహనదారులు, పాదచారుల రాకపోకలు

ప్రజాశక్తి ముంచింగి పుట్టు :- మండలనికి కూత వేటు దూరంలో ఉన్న జర్రెల గ్రామ పంచాయతీ కేంద్రానికి వెళ్లే రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పాడేరు -ముంచంగిపుట్టు ప్రధాన రహదారికి ఆనుకొని దాసరిపుట్ గ్రామం నుండి జర్రెల పంచాయతీ కేంద్రానికి వెళ్లేందుకు సుమారుగా 3 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ, రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

2018 సంవత్సరంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆనాటి గ్రామ సర్పంచ్ వంతల లలిత ఎంతో కృషి చేసి తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తీసుకొచ్చారు. రహదారి పనులు ప్రారంభించి రహదారి పొడుగునా గులకరాళ్ళను (మెటల్ రాళ్లు) వేసి వదిలేసారు. వేసిన మెటల్ పై కనీసం రోలరింగ్ సైతం చేపట్టలేదు. పంచాయితీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కావడం, రహదారి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో సుమారు 18 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు వంటి సదుపాయాలు పొందటం కోసం పంచాయతీ కేంద్రానికి వెళ్ళాల్సి ఉంది. రహదారి బాగు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న ఈ రాళ్లు తేలిన రోడ్డుపై ఓటు వేసేందుకు ఎలా అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి గుండా అనేక గ్రామాలకు చెందిన గిరిజనులు, పాదచారులు, వాహనదారులు రాకపోకలు అనునిత్యం చేస్తుంటారు. రహదారి మరమ్మతు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



రాళ్లు తేలి ఉన్న జర్రెల గ్రామ రహదారి ఇదే

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని బైక్ ర్యాలీ



రంపచోడవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ శనివారం రాజవొమ్మంగి మండలం లాగరాయి, రాజవొమ్మంగి, శరభవరం, బోర్నగూడెం, ఉర్లాకులపాడు, సంజీవనగరం, చెరుకుంపాలెం, జడ్డంగి, వట్టిగెడ్డ, సింగంపల్లి, దూసరపాము తదితర గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సిపిఎం అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు కాళ్ళ రాజబాబు, పాండవుల సత్యనారాయణ, కుంజం జగన్నాథం, టి శ్రీను తదితరులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే బిజెపిని, దానికి మద్దతిస్తున్న తెలుగుదేశం, వైసిపి, జనసేనలను చిత్తుచిత్తుగా ఓడించాలని, సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారని, మరో వైపు ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీస్తూ గ్రామీణ ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగరాజు, ప్రవీణ్, దొరబాబు, రామరాజు పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పాల్గొంన్నారు.

రంపచోడవరం : సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రంపచోడవరం సిపిఎం కార్యాలయం నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్, గాంధీనగరం, చిన్న గద్దాడ, గెద్దాడ, రంప మఠ్రివాడ, కుంజం వీధి, నడివేది పందిరివీధి, పందిరి మామిడి, సిరిగిందలపాడు గ్రామాల మీదుగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి అరుణ్, మట్ల వాణిశ్రీ, కాంగ్రెస్ నాయకులు బాల, ఇండియా వేదిక నాయకులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని తాళ్లూరు గ్రామస్తులతో సిపిఎం నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గూడెల్లి వెంకటరావు, పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు బిజెపి, టిడిపి, వైసిపిలు తీవ్ర అన్యాయం చేశాయని తెలిపారు. కాఫర్ డ్యామ్ కట్టి నిర్వాసితులను నిండా ముంచాయని, 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి చట్టానికి వ్యతిరేకంగా ఇష్టం లేని చోట భూములు సేకరించి ఇళ్లు నిర్మించి బలవంతంగా అంటగట్టే పని చేస్తున్నాయని చెప్పారు. నిర్వాసితులకు భూమికి భూమి, పూర్తిస్థాయి పరిహారాలు, ప్యాకేజీలు, 18 సంవత్సరాల నిండిన యువతీయువకులకు పరిహారం తక్షణమే ఇవ్వాలని కోరారు.

విఆర్.పురం : సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఎం ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని రామవరం, కుందులూరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, తునికాకు బోనస్ ఇవ్వకుండా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు మోసం చేశాయని, ఆ పార్టీలను ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకులు కుంజ నాగిరెడ్డి. వడ్లాది. రమేష్, కారం సుందరయ్య, ఆసు లక్ష్మయ్య, పులి బుజ్జి, పులి కన్నారావు, మురళి, కె.సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని చమగడ్డ పంచాయతీ పరిధి దదీలికవాడ, బుద్ధకోట గ్రామాల్లో సిపిఎం నాయకులు శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.శాంతిరాజు, రామకృష్ణ మాట్లాడుతూ వామపక్షాల వల్లే ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటివి వచ్చాయని, నేడు ప్రభుత్వాలు ఆ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆంజనేయులు, దుర్గారావు, సత్యనారాయణ, ప్రసాద్, వెంకన్న, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



వై.రామవరం మండలంలో ఓటర్లను కలిసిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని...

దుంబ్రిగుడ : సార్వత్రిక ఎన్నికల ప్రచారం చివరి రోజు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు రాము, సూర్యనారాయణ ఆధ్వర్యంలో కురిడి పంచాయితీ గద్దబల్లుంగు, పుట్టబంధ, నారింజవలస, గొందిగూడా గ్రామాల్లో ఇంటింటి కెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం అరుకు పార్లమెంట్ అభ్యర్థి పి అప్పలనర్శకు ఓటు వేసి గెలిపించాలన్నారు. గసభ పంచాయతీ గ్రామాల్లో మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, మండల నాయకుడు పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కించమండ, కోర్ర, గుంటసీమ, రంగిలిసింగి పంచాయతీలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్పీ పోతురాజు ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డొంబు, తిలక్ పాల్గొన్నారు.

అరకు రూరల్ : సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని సిపిఎం నాయకులు బస్కి, సుంకరమెట్టలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె,.రామారావు మాట్లాడుతూ, గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జివో 3 చట్ట బద్దత, అటవీ హక్కుల చట్టం, జాతీయ గ్రామిణ ఉపాధి హామీ చట్టం, పీసా చట్టం పటిష్టంగా అమలుకు సిపిఎం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఈ ప్రచారంలో సుంకర మెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

పెదబయలు : మండలంలోని సీతగుంట, అరడకోట, రోగులపేట, బంగారుమెట్ట, వనబంగి, జాడిగూడ, ఎగబడమా, దిగబడమా గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం ఇప్పటికే గిరిజన చట్టాలను రద్దు చేసిందన్నారు. గిరిజనుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఎంపీ అభ్యర్థి అప్పల నర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సర్బన్న, బొండా గంగాధరం పాల్గొన్నారు.

అనంతగిరి : ఇండియా ఫోరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్ నేతలు మండలంలోని గిరిజన గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు, టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, సీపీఎం మండల కార్యదర్శి నాగులు, మాజీ సర్పంచ్ సివెరి కొండలరావులు బృందాలుగా జోరుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు జి.దేవన్న, బుధరయ్య, రాము, రాజు, రామన్న పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై పోరాడే పార్టీలను గెలిపించండి

- న్యాయవాది రవితేజ

ప్రజాశక్తి-కూనవరం



నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడే పార్టీలకు ఓటు వేసి గెలిపించాలని న్యాయవాది రవితేజ శనివారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ హక్కులను కాపాడాలన్నా, అటవీ హక్కుల చట్టాల కొనసాగాలన్నా నిబద్ధతతో ప్రజలకు న్యాయం చేసే పార్టీలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిఒ నెంబర్ 3, పోలవరం నిర్వాసితులు, ముంపు బాధితులు, తుఫాను వల్ల నష్టపోయిన వారి తరుపున ఎల్లప్పుడూ సిపిఎం పోరాడుతుందని తెలిపారు. అటువంటి పార్టీల అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపడం వల్ల పోలవరం నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని గత, ప్రస్తుత ప్రజాప్రతినిధులు వారి ప్రభుత్వాలను, ఆయా పార్టీల అధిష్టానాలను ఏ రోజూ అడగలేదని, ప్రశ్నించలేదని, డిమాండ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లోనూ ఆ పార్టీలనే గెలిపిస్తే నిర్వాసితులకు ఎటువంటి న్యాయం జరగలేదని తెలిపారు. ప్రతి ఓటరు అలోచించి తమకు అండగా నిలబడే, తమ తరుపున పోరాడే వారికి పట్టం కడితే నిర్వాసితుల గొంతుక చట్ట సభల్లో వినిపిస్తారని చెప్పారు.

ఆదివాసీల హక్కులు, చట్టాలకు తూట్లు పొడుస్తున్న

బిజెపి, టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించండి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్ పిలుపు

ప్రజాశక్తి-అడ్డతీగల

ఆదివాసీల హక్కులు, చట్టాలకు తూట్లు పొడుస్తున్న బిజెపి, టిడిపి, వైసిపిలను ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అడ్డతీగల వచ్చిన వెంకట్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసీలు, అటవీ హక్కుల రక్షణ కోసం, గిరిజనుల విద్యా, ఉద్యోగ సౌకర్యాల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించి చట్ట సభలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారానే గిరిజన హక్కులు, చట్టాలు కాపాడుకోగలమన్నారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఫాసెస్టు తరహాలో వ్యవహరిస్తూ ప్రశ్నించేవారినే లేకుండా చేయడానికి ప్రయత్నిస్తుందని, అదే జరిగితే రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులన్నీ కాలరాయబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్నే మార్చివేసి అధ్యక్ష తరహా పాలన తీసుకొస్తుందన్నారు. అందువల్ల బిజెపిని, దానితో పొత్తు పెట్టుకున్న టిడిపిని, దానికి తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్, నాయకులు, కార్యకర్తలు



కండువా వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -అనంతగిరి:ఎన్నికల నేపథ్యంలో టీడీపీకి చెందిన కార్యకర్తలు వైసిపిలో చేరారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ తట్టవలస గ్రామనికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసిపిలో చేరినట్లు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా తెలిపారు. జగనన్న చేసే సంక్షేమ పథకాలతో వైసిపికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని మదీనా తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని అభివృద్ధి పథకాలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కన్నమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు 2642 ఉద్యోగాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు రికార్డు స్థాయిలో 2642 ఉద్యోగాలు లభించాయి. దీనికి సంబంధించిన వివరాలను ప్లేస్‌మెంట్ అధికారి విఆర్.రెడ్డి శనివారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌కు, ప్రిన్సిపాల్స్‌కు అందజేశారు. కళాశాలల వారీగా పరిశీలిస్తే సైన్స్-టెక్నాలజీ కళాశాలలో 1082, ఆర్ట్స్ కామర్స్ కళాశాలలో 593, ఫార్మశీ కళాశాలలో 78, న్యాయ కళాశాలలో 46, ఐఎఎస్‌ఇలో 175, ఇంజినీరింగ్ కళాశాలలో 668 ఉద్యోగాలు లభించాయి. అనంతరం వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు క్యాంపస్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసే సమయానికి విద్యార్థుల చేతిలో ఉద్యోగ నియామకపత్రం ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదివారం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి తెలిపారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలించేందుకుగాను 28 జోన్లు, 28 రూట్ లుగా విభజించినట్లు తెలిపారు. నక్కపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం పోలింగ్ సామగ్రిని, ఎన్నికలు సిబ్బందికి అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ సామాగ్రిని పిఓ,ఏపీఓలు తన సిబ్బందితో కలిసి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకుగాను బస్సులు, ఇతర వాహనాలను సిద్ధం చేశామన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-కోటవురట్ల:ఓటు హక్కును సజావుగా ధైర్యంగా వినియోగించుకోవాలని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు. మండల కేంద్రంలో పోలీసు కవాతు శనివారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలంతా అప్రమత్తంగా స్వేచ్ఛా యుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-అరకులోయ: సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. అరకువ్యాలీ తహశీల్దార్ కార్యలయం వద్ద ఇవియం పంపిణీకి చేపట్టిన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు అసెంబ్లీ నియోజక వర్గంలో 2 లక్షల 47 వేల 402 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మహిళా ఓటర్లు 1, 26,004 మంది, పురుష ఓటర్లు 1,19,391 మంది, ట్రాన్స్ జెండర్స్ 7 గురు ఉన్నారని చెప్పారు. 4వేల మంది పివిటిజి గిరిజనులను కొత్తగా ఓటరుగా గుర్తించి ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. 304 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసామని, ప్రతి పోలింగ్ కింద్రానికి నీటి సౌకర్యం, విద్యుత్తు, ర్యాంప్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నియోజక వర్గంలోని ఆరు మండలాలను 54 సెక్టార్లుగా విభజించామన్నారు. 1800 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు

ఐటిడిఎ పిఒ అభిషేక్

తరలించడానికి అన్ని విధాల రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసామన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్

అరకు వ్యాలీ నియోజక వర్గానికి సంబందించిన ఇవియంల పంపిణీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పరిశీలించారు. సకాలంలో పంపిణీ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల సిబ్బందిని సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ విజవంతంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఏజెన్సీలో విభిన్న పరిస్థితులు కారణంగా ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారులు సుధాకర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి అసౌకర్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-పాడేరు : ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్, కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.విజయ సునీత ఆదేశించారు. శనివారం ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేయాలని, అవసరమైన ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొనే విధంగా అవసరమైన రవాణా సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల సామాగ్రి తీసుకువెళ్ళేందుకు అవసరమైన రక్షిత బ్యాగులు కూడా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంపిణీ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా లైటింగ్, సిసి కెమేరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి, స్థానిక తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ, డివిఆర్ఎం రాజు, డిఇఇ అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

బండారు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలో కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి ఎన్నికల ప్రచారం చేశారు. మండల కేంద్రంలో బండారు సత్యనారాయణమూర్తితో పాటు పీవీజి కుమార్, పోతుల రమణమ్మ, అడ్వకేట్ పరవాడ సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చిన్నంనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, మాడుగుల నియోజవర్గం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి సామాలమ్మ, బాలకృష్ణ, గండి ముసలి నాయుడు, కార్యకర్తలు ఎర్ర అప్పారావు, వార్డు మెంబర్లు సూర్యనారాయణ, సింహాచలం, నాయుడు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి -చీడికాడ:ఇటీవల రెండు రోజులు క్రితం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేల వైపు వాలి ప్రమాదానికి నిలయంగా మారింది. మండలంలోని జైతువరం గ్రామం అప్పలరాజుపురం వెళ్ళు దారి మార్గంలో ఇటుకలు బట్టి సమీపాన కరెంటు స్తంభం నేలమట్టం దిశగా పూర్తిగా వాలిపోయి ఈ క్షణాన స్తంభం నేలమట్టం అవుతుందోనని ఎవరు ప్రమాదానికి గురవుతారని ప్రజల భయాందోళనకు గురవుతున్నారు. ఈమధ్య కరెంటు ప్రమాదాలకు అనేక మంది మనుషలతో పాటు మూగజీవరాసులు కూడా బలవుతుండడం మనం చుట్టూ చూస్తూ ఉన్నాము అందువలన జైత వరంలో కరెంటు స్తంభం పూర్తిగా నేలమట్టం అవకముందే ఎలక్ట్రికల్ సిబ్బంది చొరవ తీసుకొని ఈ స్తంభాన్ని సరి చేస్తారని స్థానిక గ్రామస్తులు కోరుకుంటున్నారు

ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. దీంతో ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 13న జరుగునున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థులు గ్రామాల్లో ఇప్పటి వరకు విస్తతంగా ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయా పార్టీల మేనిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకెళ్లారు. .హామీలను గుమ్మరించారు. ప్రచారం ముగియడంతో ఓటర్లను మభ్యపెట్టి ,డబ్బు ఎరచూపి ఓట్లు వేయించుకునే పనిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు నిమగ్నమయ్యారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నియంత్రించే వ్యవస్థలు ఉన్నప్పటికీ ,ప్రధాన పార్టీలు తమ పనిని తాము చాప కింద నీరులా సాగిస్తున్నారు. ఓటుకు నోటు ప్రధాన ఆయుధంగా భావించి తమ పనిని పూర్తి చేస్తున్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి కృషి : అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో విజన్ డాక్యుమెంటరీ పేరుతో ప్రత్యేక మేనిపెస్టోను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో విద్య, ఆరోగ్యం, మంచినీరు, లిఫ్ట్ ఇరిగేషన్, ఇంటింటికి కుళాయి, యువతకు ఉద్యోగ కల్పనే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లీకూతుర్లకు దార్ల బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు

అథ్లెటిక్స్‌లో అవార్డులు, పురస్కారాలు
మాతృదినోత్సవం సందర్భంగా అందజేత

ప్రజాశక్తి -కొత్తకోట:మాత దినోత్సవం సందర్భంగా దార్ల బుక్ అఫ్ వరల్డ్ రికార్డును తల్లీకూతుళ్లు అందుకున్నారు. వీరిద్దరూ వివిధ రంగాలలో కనపరిచిన వారి ప్రతిభను గుర్తిస్తూ హైదరాబాద్‌కు చెందిన దార్ల ఆర్గనైజేషన్ వీరికి దార్ల బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను మాతృ దినోత్సవం సందర్భంగా తల్లి, తనయలిద్దరికీ ఈ అవార్డు/రికార్డు ను అందజేశారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కలగర్ల నాగజ్యోతి ఉపాధ్యాయు నిగా విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థుల్ని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతూనే మరోపక్క తనకి ఇష్టమైన స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తూ పలు అవార్డులు అం దుకున్నారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ పోటీలలో పాల్గొని ముఖ్యంగా పవర్ లిఫ్టింగు, అథ్లెటిక్స్ విభాగాలలో పాల్గొని ఎన్నో బంగారు, వెండి పతకాల ఛాంపియన్షిప్‌లు సాధించారు. అంతే కాకుండా తన నిరంతర కృషి ఫలితంగా ఎన్నో ప్రపంచ రికార్డులు(బ్రిలియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఏషియా బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డ్ తదితర, మరెన్నో ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు అందుకున్నారు అలాగే తమ విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూనే ఒక మాతృమూర్తిగా తన ఒక్కగానొక్క కుమార్తె అయిన కలగర్ల సాహితీ (రాష్ట్ర పతి అవార్డు గ్రహీత) ని వివిధ రంగాలలో అభివృద్ధి నడిపిస్తోంది. కుమారి కలగర్ల సాహితి సిమ్మింగ్ లో ఎన్నో అవార్డులు, రికార్డ్స్ తన సొంతం చేసుకుంది. మల్టిపుల్ టాలెంటెడ్ వండర్ కిడ్ గా ఎంతో పేరు సంపాదించింది. అటు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ ఎంతోమంది మన్ననలను అందుకుంది. సిమ్మింగ్‌లో ముఖ్యంగా జలాశయాలు వేయడం, నీటిలో సూర్య నమస్కారాలు చేస్తూ ఇప్పటికే 32 వరల్డ్ రికార్డులు (ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, భారత్ బుక్ వరల్డ్ రికార్డ్, ఆంధ్ర బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కలాం బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్, బ్రిలియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లు సాధించింది. ఎన్నో ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ఇంగ్లీష్ ఒలింపియాడ్, సైన్స్ ఒలింపియాడ్ లలో వివిధ పథకాలు సాధించింది.అంతేకాక అంతర్జాతీయ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో ఎన్నికయి అమెరికా వాషింగ్టన్ డిసి లో తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చి తన చదివిన పాఠశాలకు, దేశానికి ఎంతో గుర్తింపును తీసుకొచ్చింది. చిన్ననాటి నుంచి ఈతలో ప్రతిభ కనబరుస్తూ ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ అవార్డులు గెలుచుకుంది.గతంలో రేవుపోలవరం సముద్రం నుంచి తన ప్రాణానికి తెగించి ఇద్దరు చిన్నారుల ప్రాణాలను కాపాడి సాహస బాలిక అవార్డు కూడా అందుకోవడం విశేషం. ఇలా ఎన్నో విషయాల్లో ప్రతిభ కనబరుస్తూ తల్లిని మించిన తనయగా ఎదిగింది సాహితి.

ఈ సందర్భంగా నాగ జ్యోతి, సాహితి మాట్లాడుతూ ప్రస్తుతం లభించిన ఈ అవార్డులు తమ ప్రతిభ కు మరింత ప్రోత్సాహం కలిగించేదిగా ఉందన్నారు...

హెలికాప్టర్‌లో ఎన్నికల సామగ్రి తరలింపు

- ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు



కాలేజీ గ్రౌండ్‌లో హెలీప్యాడ్‌లో ల్యాండ్ అయిన హెలీకాప్టర్

ప్రజాశక్తి- రంపచోడవరం: వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం గుర్తేడు, పాత కోట పోలింగ్ కేంద్రాల నుండి పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వివి ప్యాడ్‌లు రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు ఏర్పాటు చేసిన హెలీకాప్టర్‌ను ముందస్తుగా శనివారం ట్రైల్ రన్ చేశారు. రంపచోడవరం డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ల్యాండింగ్ ప్రదేశాన్ని రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై మోహన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన అధికారులకు, సిబ్బందికి సంబంధించిన వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోడవరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ చాంబర్లో ఆయన మాట్లాడుతూ 13న ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వారి వారి సొంత వాహనాలను పార్కింగ్ చేసుకొనే విధంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఖాళీ స్థలంలోనూ, సెక్టార్ అధికారులకు లెనోరా ఆసుపత్రి ప్రాంగణంలోనూ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎటపాక, చింతూరు, విఆర్ పురం, కూనవరం, వై.రామవరం మండలాలకు సంబంధించిన ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే బస్సులు, బొలెరో వాహనాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాలకు సంబంధించిన వాహనాలను లెనోరా కాలేజీ ప్రాంగణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఈ పార్కింట్ స్థలాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

బాబువి ఉత్తుత్తి హామీలే..!

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదాన్నీ అమలు చేయలేదని వైసిపి లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు చంద్రబాబు అనే మోసానికి, జగన్మోహన్ రెడ్డి అనే నమ్మకానికి మధ్య జరుగుతున్నాయని తెలిపారు. చంద్రబాబు కేవలం ప్రచారం కోసమే డబ్బు ఖర్చు చేసే మనిషి అని తెలిపారు. దానికి ఉదాహరణగా విశాఖపట్నంలో ఆయన వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులను పేర్కొనవచ్చన్నారు. ప్రచార ఆర్భాటం తప్ప రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చింది లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వంలోనే అందుతున్నాయని తెలిపారు. సమావేశంలో హిందూ, క్రిస్టియన్ మత పెద్దలు రాజు, భరత్ రాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్ - విశాఖపట్నం - సికింద్రాబాద్, కెఎస్ఆర్ బెంగళూరు - రూర్కెలా - ఎస్ఎంవిటి బెంగళూరు, ఎస్ఎంవిటి బెంగళూరు -ఖరగ్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు, ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ - ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07097 సికింద్రాబాద్ - విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు మే 12 ఆదివారం రాత్రి 19.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06:30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 07098 విశాఖపట్నం - సికింద్రాబాద్ వేసవి ప్రత్యేక రైలు 13న సోమవారం రాత్రి 19.50 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేటి మరుసటి రోజు ఉదయం 8:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తాయి

06249 కెఎస్ఆర్ బెంగళూరు-రూర్కెలా వేసవి ప్రత్యేక రైలు మే 17 శుక్రవారం రాత్రి 21.15 గంటలకు కెఎస్ఆర్ బెంగళూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16.08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 16.10 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 05.00 గంటలకు రూర్కెలా చేరుకుంటుంది. 06250 రూర్కెలా - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 19 ఆదివారం ఉదయం 07.00 గంటలకు రూర్కెలా నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 19.18 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 19.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 14:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, రాయగడ, తిట్లాగఢ్, బర్గస్‌పూర్, బర్గాస్ రోడ్, బలాంఘర్, బలంగ్‌హర్ రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

06259 ఎస్ఎంవిటి బెంగళూరు - ఖరగ్‌పూర్ వేసవి ప్రత్యేక రైలు మే 25 శనివారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 05.28 గంటలకు దువ్వాడకు చేరుకొని మరలా 05.30 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19.30 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. 06260 ఖరగ్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 26 ఆదివారం రాత్రి 22.15 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 11.02 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు వైట్‌ఫీల్డ్, జోలార్‌పేట్, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మాపూర్, ఖుర్దా రోడ్, భువనగిరి, కటక్, భద్రక్, బాలసూరు మీదుగా ప్రయాణిస్తాయి.

06251 ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ వేసవి ప్రత్యేక రైలు మే 18 శనివారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05.28 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 05.30 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.00 గంటలకు ఖుర్దా రోడ్డుకు చేరుకుంటుంది. 06252 ఖుర్దా రోడ్ - ఎస్ఎంవిటి బెంగళూరు వేసవి ప్రత్యేక రైలు మే 19 ఆదివారం రాత్రి 22.30 గంటలకు ఖుర్దా రోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.13 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15.15 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 10:55 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు వైట్‌ఫీల్డ్, జోలార్‌పేట్, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగంగగూడ, సంబల్పూర్, రైరాఖోల్, అనుగుల్, ధెంకనల్, కటక్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి.

విపత్కర పరిస్థితుల్లో 'విశాఖ ఉక్కు'

- నేటికీ ఉద్యోగులకు అందని నెల జీతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును విపత్కర పరిస్థితుల్లోకి కేంద్రంలోని బిజెపి, స్టీల్ యాజమాన్యం నెట్టేశాయి. ఉత్పత్తి జరగకుండా ఇప్పటికే 3 బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో 2 మూసేశారు. 6 రోలింగు మిల్లులుంటే ఒకదాన్ని ఆన్ అండ్ ఆఫ్ రన్ చేస్తూ మిగతా అన్నిటినీ దాదాపు నడవకుండా నిలిపేశారు. ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌పై కేవలం 4500 టన్నుల స్టీలే ప్రస్తుతం వస్తోంది. రోజుకు సుమారు 20 వేల టన్నులు ఉత్పత్తి కావాల్సిన ఉక్కు కర్మాగారంలో ఇంత పతన స్థాయిలో ఉత్పత్తి రావడం, సంక్షోభంలో చిక్కుకోవడం గడచిన 40 ఏళ్లలో ఇదే తొలిసారి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో 5 లక్షల టన్నుల స్టీల్ డిమాండ్ ఉండగా ప్రస్తుతం 70 వేల టన్నులే ఉత్పత్తి అవ్వడం ఉక్కు సంక్షోభానికి తార్కాణంగా నిలిచిందన్నారు.

11వ తేదీ వచ్చేసినా ప్లాంట్‌లో జీతాలివ్వని పరిస్థితి నెలకొందని, అయినా కార్మికులు ఉత్పత్తిలో పాల్గొంటూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ భూములు వేల ఎకరాలు రాష్ట్రపతి పేరు మీద ఉన్నాయని, వాటిని ఆర్ఐఎన్ఎల్ పేరు మీదకు మార్చాలని, అప్పుడు కంపెనీ నెట్‌వర్క్ మైనస్ రూ.1700 కోట్ల నుంచి రూ.70 వేల కోట్ల ప్లస్‌లోకి వెళు తుందని తెలిపారు. ఇదే జరిగితే ప్లాంట్‌కు రుణాలివ్వడానికి బ్యాంకులన్నీ క్యూ కడతాయన్నారు. ప్లాంట్‌లో మెగా వెంచర్‌కు తెరతీయాలని, సెయిల్ ఆర్ఐఎన్ఎల్, ఎన్ఎండిసి కలిపి మెగా వెంచర్ చేస్తే స్టీల్ ఇండస్ట్రీకి మంచి రోజులు వస్తాయని, ఉత్పత్తి పెరగనుందని తెలిపారు.

చివరి రోజు ముమ్మరంగా ప్రచారం



ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -సీలేరు:రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రచార గడువు శనివారం సాయంత్రం ఐదు గంటలకు ముగిస్తుండడంతో జీకే వీధి మండలం సీలేరు, దారకొండ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఇండియా వేదిక, వైసిపి, కూటమి పార్టీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు ఎవరు అభ్యర్థులును వారు గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచార నిర్వహించి తమ అభ్యర్థులకే ఓట్లు వేయాలని ఓటర్లకి విజ్ఞప్తి చేశారు. ప్రచారం ముగిసిన తరువాత ఆయా పార్టీల వారు తమ పార్టీ గెలుస్తుందంటే, తమ పార్టీ గెలుస్తుందని చర్చించుకోవడం కనిపించింది.

విశాఖ దక్షిణంలో అభివృద్ధి ఏదీ ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదేళ్ల గణేష్ కుమార్ హయాంలో దక్షిణ నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి సంతోష్ కుమార్ విమర్శించారు. శనివారం కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి గణేష్ కుమార్‌ను ఇంటికి పంపాలని ఓటర్లను కోరారు. కులమతాలకు, వర్గ రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం, దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి హస్తం గుర్తుపై ఓటు వేసి విజయం చేకూర్చాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హయాంలో దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు ప్రభుత్వ ఫలాలు అందలేదన్నారు. మత్స్యకారులు, ముస్లింలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాసుపల్లి గణేష్ కుమార్ హయాంలో ఫిషింగ్ హార్బర్ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి మాట్లాడుతూ మతతత్వ బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన కూటమిని, అధికార వైసిపిని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులకు పట్టంకట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ విశాఖ జిల్లా అధ్యక్షులు వజ్జిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో డైట్‌కు తృతీయ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి :ఎన్ఎస్‌టిఎల్ వైజ్ఞానిక ప్రదర్శనలో అనకాపల్లి డైట్ కళాశాల విద్యార్థులు మూడవ స్థానం సాధించారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌టిఎల్ - డిఆర్‌డిఓలో మూడు రోజుల పాటు జరిగిన సాంకేతిక దినోత్సవ వేడుకలు శనివారం ముగిసాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు 115 ప్రాజెక్టులు రిజిస్టర్ కాగా, 48 ప్రాజెక్టులు పోటీలో పాల్గొన్నాయి. డైట్ కళాశాలకు చెందిన సెల్ఫ్ రిపేరింగ్ కాంక్రీట్ అందరి సైంటిస్టుల మన్ననలు పొందడమే కాకుండా పోటీల్లో తృతీయ స్థానాన్ని సంపాదించుకుంది. అనంతరం ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ గైడ్ ఆడారి దేవి ప్రసాద్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు చేసేవిధంగా డైట్ కళాశాల విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. పోటీల్లో తృతీయ స్థానం రావడం పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి ఆడారి దేవి ప్రసాద్, డీన్ అకాడెమిక్స్ కె.పార్వతి, డీన్ అడ్మినిస్ట్రేషన్ కెఎస్.ఈశ్వరరావు, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు డైట్ ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ డాక్టర్ నళిని తదితరులు పాల్గొన్నారు.